



'ఉపాధి' కరువు..?!

కొన్ని పనులకే పరిమితమైన ఎన్ఆర్ఈజీఎస్ పథకం

- పనిలేక వలసబాటలో కూలీలు
- పట్టణాలకు తరలుతున్న జనం
- జిల్లాలో 2,19.677 జాబ్ కార్డులు, 4,61,386 మంది కూలీలు
- స్కీమ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం



నర్సింహులపేట నుంచి మరిపెడకు ట్రాక్టర్‌లో పనికి వెళ్తున్న కూలీలు

నర్సింహులపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని కూలీలు వలసబాట పడుతున్నారు. చేతి నిండా పని లేకపోవడంతో పట్టణాలకు తరలివెళ్తున్నారు. ఊళ్లల్లో వలసలను నివారించి, స్థానికులకు పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రప్రభుత్వం మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎన్ఆర్ఈజీఎస్) ప్రారంభించింది. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 2,19,677 జాబ్ కార్డులుండగా.. 4,61,386 మంది కూలీలు ఉన్నారు. వారిలో మార్చి 4వ తేదీ వరకు 10,023మంది కూలీలకు మాత్రమే ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పించారు.

ఆరు మాసాలుగా..

ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో కూలీలకు ఆగస్టు మాసం నుంచి ఇప్పటి వరకు గ్రామీణులకు పనులు కల్పించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. చేతినిండా పనులు లేకపోవడంతో దినసరి కూలీలు నిత్యం ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు, ఆటోల్లో ప్రయాణం చేస్తూ ఇతర గ్రామాలకు ఎండుమిర్చి ఏరేందుకు వెళ్తున్నారు. కొందరు కూలీలతోనే వననర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్ పనులు చేయిస్తున్నారు.

రెక్కాడితేగాని పూటగడవని కొందరు కూలీలకు ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో జాబ్‌కార్డు ఉన్నప్పటికీ సకాలంలో పనులు కల్పించకపోవడంతో ఇతర గ్రామాలకు, పట్టణాలకు వలస వెళతున్నారు. మహబూబాబాద్ జిల్లాలో నర్సింహులపేట, మరిపెడ, దంతాలపల్లి, నెల్లికుదురు, చిన్నగూడూరు మండలాల నుంచి అత్యధిక మంది కూలీలు పనులు లేక పక్క గ్రామాలకు ఆటోలు, ట్రాక్టర్లు, బొలెరో వాహనాల్లో మిర్చి తోటలు ఏరేందుకు వెళ్లగా, మరి కొంత మంది కూలీలైతే ఇంటికి తాళాలు వేసి హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, విజయవాడ లాంటి పట్టణాలకు వలస వెళ్లినట్లు సమాచారం.

కొన్ని పనులకే పరిమితం..

ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో గుట్టచుట్టూ కంధకాలు తొవ్వట, మట్టిరోడ్లు, చాపల చెరువుల తవ్వకం, నర్సరీ, అవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు మెటీరియల్ సంబంధించిన పనులతో కలిపి సుమారుగా 25 రకాల పనులు చేయాల్సి ఉన్నది. కానీ, జిల్లాలో ఆ పథకం కొన్ని పను లకే పరిమితమవడం, కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించక పోవడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ తీసుకొని గ్రామీణ కూలీలకు సకాలంలో కూలి కల్పించి, వలసలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాలకే పరిమితం

గ్రామాల్లో అందుబాటులో ఉంటూ కూలీలకు పనులు కల్పించాల్సిన అధికారులు మండల ప్రజాపరిషత్ కార్యాలయానికే పరిమితం అవు తున్నరనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు వస్తున్నారు.. వెళ్త న్నారే తప్ప.. కూలీలకు క్షేత్రస్థాయి పనుల కల్పనలో విఫలమౌతు న్నారని రైతుకూలీ సంఘం నాయకులు ఎనగండ్ల సోమిరెడ్డి, బిక్షపతి, వీరభద్రం ఆరోపిస్తున్నారు.



నర్సింహులపేటలో ఇంటికి తాళం వేసి పని కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లిన దృశ్యం

ఉపాధి పనులు కల్పించాలి

- కొంపెల్లి నరేష్, నర్సింహులపేట

ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో కూలీలకు పనులు కల్పించాలి. 8నెలల నుంచి పనులు లేక కూలీలు ఇతర గ్రామాలకు వలస వెళ్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని, కూలీలకు పనులు కల్పించాల్సిన అవసరం ఉన్నది.

పనుల కల్పనకు ప్రణాళిక సిద్ధం

- మధుసూదన్, డీఆర్‌డీవో పీడీ, మహబూబాబాద్ జిల్లా

జూన్ మాసం నుంచి పనులు కల్పించని మాట వాస్తవమే. జిల్లా లోని కొన్ని మండలాల్లో నర్సరీల్లో మెటీరియల్ పనులు జరుగు తున్నాయి. మార్చి నుంచి కూలీలకు క్షేత్రస్థాయిలో పనులు కల్పించేం దుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నాం. కూలీలకు పనులు పూర్తి స్థాయిలో కల్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

మండలికి 'రాములమ్మ'

- ఎమ్మెల్యే కోటాలో విజయశాంతికి అవకాశం
- స్వగ్రామంలో ములుగు జిల్లా రామన్నగూడెంలో సంబరాలు



ములుగు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సినీ నటి, రాజకీయ నాయకురాలు విజయశాంతిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. ఎమ్మెల్యే కోటాలో ఆమెకు ఈ అవకాశాన్ని కల్పిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె మూలాలు మరోసారి తెరపైకి వచ్చాయి. 2005లో తల్లి తెలంగాణ పార్టీని స్థాపించిన తొలిరోజుల్లో తన స్వస్థలం ములుగు జిల్లాలోని ఏటూరునాగారం మండలం రామన్నగూడెంగా విజయశాంతి ప్రకటించుకున్నారు. తాను చెన్నైలో పుట్టి పెరిగినప్పటికీ తన పూర్వీకులు రామన్నగూడెంలో నివాసం ఉండేవారని తెలిపారు. సినీరంగంలో అగ్ర కథానాయికగా కొనసాగుతూ అభిమానుల చేత రాములమ్మగా పిలవబడుతున్న ఆమె.. రాజకీయ రంగంలోకి అడుగుపెట్టిన తర్వాత తన స్వస్థలంపై చేసిన ప్రకటన అప్పట్లో సంచలనం కలిగించింది. స్వయంగా రామన్నగూడెం వచ్చిన విజయశాంతి స్థానికులతో మమేకమయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, బీజేపీలో చేరిన తర్వాత ఆమె పలుమార్లు ములుగుకు వచ్చారు. ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తాజాగా కాంగ్రెస్ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా విజయశాంతిని ప్రకటించడంతో రామన్నగూడెంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, ఎమ్మెల్యేల సంఖ్యాబలం చూసుకుంటే విజయశాంతి గెలుపు దాదాపు ఖరారైనట్లేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

గొంతులో పల్లిగింజ అడ్డుపడి బాలుడు మృతి

- గూడూరు మండలం నాయక్‌పల్లిలో ఘటన



అక్షయ్ శివప్రేమ్ కుమార్ (ఫైల్)

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పల్లిగింజ గొంతులో అడ్డపడి.. ఓ బాలుడు మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం నాయక్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. నాయకపల్లి గ్రామానికి చెందిన గుండెల వీరన్న-కల్పన దంపతులకు ఇద్దరు కుమార్తెలు దివ్యశ్రీ, భవ్యశ్రీ, ఏడాదిన్నర బాలుడు అక్షయ్‌శివ ప్రేమ్‌కుమార్ సంతానం. ఈనెల 7న శుక్రవారం ఇంటివద్ద పల్లిగింజలు తింటుండగా ఒక్కసారిగా పొలమారి గింజ ఊపిరితిత్తుల్లోకి వెళ్లింది. దీంతో శ్వాస పీల్చుకోవడం ఇబ్బంది పడుతుండడంతో గమనించిన కుటుంబసభ్యులు బాలుడిని మరుసటిరోజు శనివారం చికిత్స నిమిత్తం వరంగల్ ఏంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ. బాలుడు అక్షయ్ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

ఎస్సారెస్పీ నీళ్ల కోసం ఘర్షణ

- విస్సంపల్లి, తుమ్మలచెరువు తండా.. బాల్యతండాల రైతుల మధ్య గొడవ
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



ఎస్సారెస్పీ ఉప కాలువ వద్ద ఘర్షణ పడుతున్న రైతులు

చిన్నగూడూరు, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ నీళ్ల కోసం రైతుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మరిపెడ మండంలోని డీవీఎం 60మెయిన్ కాలువ నుంచి 18 ఎల్ ఉపకాలువ ద్వారా చిన్నగూడూరు మండలంలోని విస్సంపల్లి గ్రామానికి వస్తున్న నీటిని బాల్యతండా రైతులు అడ్డున్నారు. దీంతో ఆగ్రహించిన విస్సంపల్లి, తుమ్మలచెరువు తండాల రైతులు శనివారం అర్ధరాత్రి కెనాల్ కాల్వ దగ్గరికి వెళ్లి.. కాలువలో అడ్డుగా వేసిన బండరాళ్లను తీస్తున్న క్రమంలో ఇరు గ్రామాల రైతులు మధ్య గొడవ పడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

ఆదివారం విస్సంపల్లి, తుమ్మలచెరువు తండా రైతులు బొమ్మలింగన్న, శ్రీశైలంను ఫోనులో సంప్రదించగా.. పంట చేతికందే సమయంలో ఎండిపోతుంటే సాగు నీటి కోసం ఎస్సారెస్పీ కాలువను తమ గ్రామాల్లోని కొందరు రైతులం కలిసి రూ.30 వేల సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించామని తెలిపారు. నీళ్ల కోసం ఎన్నోరోజులుగా ఎదురుచూస్తున్నామన్నారు. బాల్యతండా వద్ద నీటి సరఫరా నిలిపివేయడంతో.. ఈ విషయం తెలుసుకోవడానికి వెళ్లిన రైతులతో బాల్యతండా, విస్సంపల్లి, తుమ్మలచెరువుతండా రైతుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొందని పేర్కొన్నారు.

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, సాగునీరు అందించాలని ఇరుగ్రామాల రైతులు కోరుతున్నారు. కాగా, ఈ విషయంపై తహసీల్దార్ మహబూబ్ అలీని వివరణ కోరగా తమ దృష్టికి రాలేదని, విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

280 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత
8
పోలీస్ టీంకు కోచ్‌గా ఇనుగుర్తి వాసి
● వాలీబాల్ శిక్షకుడిగా వరుసగా మూడోసారి



అనంతాద్రి ఆలయంలోని శ్రీవేంకటేశ్వర స్వామి విగ్రహం

గోవిందా.. గోవిందా

రేపటి నుంచి అనంతాద్రిలో బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన శ్రీవేంకటేశ్వర ఆలయం
- భక్తుల కోసం దేవాలయంలో ఏర్పాట్లు పూర్తి
- 15న స్వామి వారి కల్యాణమహోత్సవం



అనంతాద్రి గుట్టపై జగన్నాథ వేంకటేశ్వరస్వామి దేవస్థానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణ సమీపంలోని అనంతాద్రి స్వయంభూ శ్రీజగన్నాథ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 11వ తేదీ నుంచి 16 వరకు కుంభాభిషేక బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఆలయాన్ని ముస్తాబు చేసి, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా అనంతాద్రి దేవాలయంతో పాటు పరిసరప్రాంతాలు ఉన్నాయి. శ్రీవేంకటేశ్వరుడికి నిత్యం పూజలు జరుగుతాయి. రైల్వేసౌకర్యం ఉండడంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు సుదూర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు అనంతాద్రికి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తారు. కోరిన కోర్కెలు తీర్చే శ్రీజగన్నాథ వేంకటేశ్వరుడిని పూజించేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. 40 అడుగుల ఎత్తు, 15 ఎకరాల చుట్టూ విస్తీర్ణంతో కలిగిన అనంతాద్రి గుట్టపై స్వయంభూ శ్రీజగన్నాథ-వేంకటేశ్వరస్వామి దేవస్థానం రోజురోజుకు భక్తులు, పర్యాటకులను ఆకర్షిస్తోంది.

700 ఏళ్లనాటి ఆలయం...

అనంతాద్రి గుట్టపైన శ్రీబలభద్ర సుభద్ర సమేత శ్రీజగన్నాథ స్వామి స్వయంభూవులుగా వెలసినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. 13వ శతాబ్దంలో ఆ ప్రాంతానికి శ్రీరామానుజులు కలలో జగన్నాథ వేంకటేశ్వరుడు వచ్చి తాను గుట్ట పడమటి కనుమల్లో వెలశానని చెప్పి, క్షేత్రాన్ని అభివృద్ధి చేయాల్సిందిగా ఆదేశించారని నానుడి. ఆ మరునాడే గ్రామ ప్రజలతో కలిసి గుట్టపై తిరుగుతుండగా, జగన్నాథస్వామి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలు వారి కంటపడ్డాయి. ఆ తర్వాత ఆలయాన్ని నిర్మించి, పూజలు చేసేవారని ఆలయ చరిత్ర ద్వారా తెలుస్తోంది. అప్పట్లో రవాణా సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో భక్తుల రాక తగ్గి క్రమక్రమేణా దేవాలయం ముళ్లచెట్లతో నిండిపోయింది. ఆ తర్వాత తిరిగి 19వ శతాబ్దంలో ఆలయాన్ని పునరుద్ధరించారు. 1964లో జెన్నారెడ్డి లక్ష్మీ నర్సింహారెడ్డి, భార్య నర్సమ్మ ఆధ్వర్యంలో స్వయంభూ జగన్నాథ స్వామి ఆలయాన్ని నిర్మించినట్లు పూర్వీకులు చెబుతున్నారు. 1964 నుంచి 1968 వరకు నిత్యపూజలు జరిగాయి. ఆ తర్వాత ఆలయం శిథిలావస్థకు చేరడంతో 2002 వరకు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. అనంతరం నూకలరాంచంద్రారెడ్డి ఆలయాన్ని పునరుద్ధరించారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అంతే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం మహబూబాబాద్ రైల్వేట్రాక్ పక్కనుంచి నూతన రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఆలయానికి వెళ్లే దారిలో గరుత్మంతుని, ఆంజనేయస్వామి భారీ విగ్రహాలు, దేవాలయం పక్కన చెరువు మధ్యలో పెద్దజీయర్‌స్వామి విగ్రహం ఏర్పాటు చేయడంతో రోజురోజుకు ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్ ఇలా..

అనంతాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి కుంభాభిషేక బ్రహ్మోత్సవాలు ఈనెల 11న ప్రారంభమై 16న ముగుస్తాయని ఆలయ ప్రధాన అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యులు ఆదివారం తెలిపారు. రోజూ సాయంత్రం 6గంటలకు ప్రవచనాలుంటాయి. 11న సాయంత్రం 5.30 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, అంకురారోహణ, విశ్వక్సేనపూజ, పుణ్యహవచనము, రక్షాబంధనం పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

- 12న ఉదయం 9.30 గరుడా దివాసం సంతానార్థులకు గరుడ ప్రసాదం తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 5.30 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణం, దేవతాహ్వానం, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాల నిర్వహణ.
- 13న ఉదయం 9.30 గంటలకు ఉత్సవ వరులకు అభిషేక పూజాకార్యక్రమాలు.
- 14న ఉదయం 9.30 గంటలకు మూలావరులకు 108 కలశ అభిషేకం, సాయంత్రం ఎదురుకోళ్లోత్సవం
- 15న ఉదయం 10.30 గంటలకు శ్రీవారికల్యాణమహోత్సవం, సాయంత్రం తెప్పోత్సవ పూజా కార్యక్రమాల నిర్వహణ
- 16న మహాపూర్ణాహూతి, చక్రస్నానం, శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, పవలింపుసేవ, మహదాశీర్వచన పూజాకార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

బ్రహ్మోత్సవాల ఊరేగింపు రథం ప్రారంభించిన చిన్నజీయర్ స్వామి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అనంతాద్రి స్వయంభూ శ్రీజగన్నాథ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల ఊరేగింపు రథాన్ని ఆదివారం రాత్రి శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ప్రారంభించారు. ఈనెల 11వ తేదీ నుంచి 16 వరకు స్వామివాకి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, 15న శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపించేందుకు ఏర్పాట్లు చేశారు. కల్యాణ అనంతరం స్వామివారిని ఊరేగించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథాన్ని చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల ఊరేగింపు రథాన్ని ప్రారంభిస్తున్న చిన్నజీయర్ స్వామి

జాజిరి.. జాజిరి

తొర్రూరు రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రంగుల హోలి పండుగ పర్వదినానికి ముందు తొమ్మిది రోజుల పాటు ఆడుకునే జాజిరి (కోలాలు) ఆటను తొర్రూరు మండలం మండలంలోని పలు గ్రామాల్లో చిన్నారులు ఆనందోత్సవాల నడుమ ఆడుతున్నారు. ఆదివారం ఫత్తేపురంలో సాయంత్రం కాగానే చిన్నారులు గ్రామంలోని వీధుల్లో జోలపట్టి కోలలు కొడుతూ.. పల్లెపాటలు ఆటలు ఆడుతుండటంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తూ, వారికి ధాన్యం వితరణ చేస్తున్నారు. అంతరించి పోతున్న ఈ కళలను చిన్నారుల ఆటలతో తమపాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సంతోషంతో చిన్నారులకు స్వాగతం పలుకుతున్నారు.



ఫత్తేపురంలో జాజిరి ఆడుతున్న చిన్నారులు

సాగు నీటి కోసం కర్షకుల కష్టాలు



బీచ్‌రాజ్‌పల్లి శివారులోని ఆకేరులో మోటార్లు బిగించిన రైతులు

మరిపెడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి కోసం రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మరిపెడ మండలం ఆకేరు పరివాహక ప్రాంతానికి ఇరువైపులా ఉన్న ఉల్లెపల్లి, బీచ్‌రాజ్‌పల్లి, ఎడ్జర్ల, తండాధర్మారం, పురుషోత్తమాయగూడెం, బాల్ని ధర్మారానికి చెందిన రైతులు వందలాది ఎకరాల వరిపంట సాగు చేశారు. అయితే గడిచిన ఏడాది ఆకేరులో నీరు సమృద్ధిగా ఉండి పంటపొలాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా రైతుల చేతికి వచ్చాయి. ఈ సంవత్సరం కనివినిఎరగని వర్షం కురిసినా రైతులకు సాగునీటి కష్టాలు తప్పట్లేదు. దీంతో రబీ వరిసాగు చేస్తున్న అన్నదాతలకు ఆకేరు నదిలోని ఇసుకను క్రేన్స్, ప్రొక్లయినర్స్‌తో తోడి.. డజన్ల కొద్ది మోటార్లు బిగించి నీటిని తరలిస్తున్నారు. మరికొన్ని రోజులైతే ఈ నీరు కూడా లభ్యం కాకపోవచ్చునని ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఎస్సారెస్పీ కాలువల ద్వారా ఆకేరుకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



రాఘవపట్నంలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సీతక్క

- పథకాల్లో తొలి ప్రాధాన్యం కల్పిస్తున్నాం..
- పురుషులకు సమానంగా ఉద్యోగావకాశాలు
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. కలెక్టర్ టీఎస్.దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, అదనపు కలెక్టర్ సంపత్ రావుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 5, 6 తేదీల్లో మహిళా ఉద్యోగులకు 16 రకాల క్రీడా పోటీలు నిర్వహించగా విజేతలకు మంత్రి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడారు. రాష్ట్రంలోని మహిళలకు అన్నిరంగాల్లో ప్రాధాన్యత ఇవ్వడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకచొరవ చూపుతున్నారన్నారు. మహిళల హక్కుల సాధన కోసం నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. కష్టాల్లో ఉన్న మహిళా కుటుంబాలను ఆదుకోవడానికి పలు నిర్ణయాలు తీసుకుంటున్నారని, మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఆర్థికంగా ఎదగడానికి ఇందిరమ్మ మహిళా క్యాంటీన్ ఏర్పాటు చేయడం, పెట్రోల్ పంపులు, రైస్‌మిల్లులు, సోలార్ పవర్ తయారీ, ఆర్టీసీ బస్సులతోపాటు పలు రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఆర్థిక సాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో పురుషులతో సమానంగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఇప్పటికే 37శాతం మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పించినట్టు తెలిపారు. ఎక్కడాలేని విధంగా రూ.21వేల 635కోట్లతో మహిళా సంఘాల గ్రూపులకు నిధులు కేటాయించి పలు పథకాల్లో భాగస్వామ్యం చేశామని, డ్వాక్రా గ్రూపు మహిళలు ప్రతి నెల రూ.5లక్షల ఆదాయం పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రి సీతక్క కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, డీడబ్ల్యూవో శిరీష, జిల్లాలోని వివిధ శాఖల మహిళా ఉద్యోగులు, టీజీవో, టీఎన్‌జీవో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం ఇందిరమ్మ పథకం

గోవిందరావుపేట(ఆంధ్రజ్యోతి): ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం మండలంలోని రాఘవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని ఇప్పలగడ్డ గ్రామంలో రూ.5లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ఆమె కలెక్టర్ దివాకర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగానే ములుగు జిల్లాలో మొదటిసారి ఇందిరమ్మ ఇళ్ల పథకం నమూనా నిర్మాణం కోసం శంకుస్థాపన చేశామన్నారు. మోడల్ హౌస్‌ను పరిశీలించి తక్కువ ధరతో నాణ్యతతో ఇల్లు ఎలా కట్టాలో పేదలు పరిశీలించి తమ స్థలాల్లో నిర్మించుకోవాలని సూచించారు. రాబోయే నాలుగేళ్లలో పేదవాడి సొంతింటి కల నెరవేర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్ల యాప్ ప్రారంభించుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులలో అర్హులైన దరఖాస్తులను ఎంపిక చేసి మొదటి విడతగా ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ప్రతి దశలో ఇంటి నిర్మాణ పురోగతి వివరాలు ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌రెడ్డి, తహసీల్దార్ సృజన్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో గెలుపొందిన గ్రామపంచాయతీ సిబ్బందికి బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న మంత్రి సీతక్క



రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

రామప్ప ఆలయంలో సందడి

వెంకటాపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో భక్తులు, విదేశీయుల సందడి నెలకొంది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, విదేశాలకు చెందిన పర్యాటకులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. ఈ సందర్భంగా రామలింగేశ్వర స్వామిని దర్శించుకోగా అర్చకులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి ఆనందం వ్యక్తంచేశారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్‌లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సరస్సు వద్దకు చేరుకుని బోటులో విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.

మేడారంలో భక్తుల కోలాహలం



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం కోలాహలం కనిపించింది. వనదేవతలు సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వారాంతపు సెలవు కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు ఇచ్చారు. భక్తిశ్రద్ధలతో తల్లుల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, చీరె సారె, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు ఎత్తు బంగారం(బెల్లం), యాట మొక్కులు సమర్పించుకున్నారు. సుమారు 15వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

తాగేందుకు గుక్కెడు నీళ్లు కరువు

వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు గద్దెల పరిసరాల్లో తాగేందుకు గుక్కెడు నీళ్లు లేవని ఆరోపిస్తున్నారు. దర్శనాల సమయాల్లో ముడుపులు, ఎత్తు బంగారం(బెల్లం)తో వృద్ధులు, పిల్లలు, మొక్కులకు రాగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.



ప్రవీణ్‌కుమార్‌తోపాటు కుమారుడు, కూతురు అంతిమయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

ముగిసిన ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియలు

నెల్లికుదురు(మహబూబాబాద్ జిల్లా), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఎస్సారెస్పీ కాలువలో కారు పడి, కొట్టుకపోయి మృతి చెందిన ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్‌ల అంత్యక్రియలు స్వగ్రామం మేచరాజుపల్లిలో ఆదివారం జరిగాయి. ప్రవీణ్‌కుమార్, చైత్రసాయి, సాయివర్ధన్ మృతదేహాలకు శనివారం వరంగల్ ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి, అనంతరం స్వగ్రామం మేచరాజుపల్లికి తీసుకువచ్చారు. గ్రామస్థులు మృతదేహాలను చూసి కన్నీటి పర్వంతమయ్యారు. ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి చెందిన వార్త విని సుదూర ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు తరలివచ్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ముగ్గురి మృతదేహాలను స్వర్గరథంలో గ్రామశివారు చెరువు వద్దకు తీసుకవెళ్లారు. ప్రవీణ్‌కుమార్ తండ్రి సోమారపు సారంగపాణి ముగ్గురికి తలకొరివి పెట్టి, చితికి నిప్పంటించి అంత్యక్రియలు పూర్తిచేశారు.



ప్రవీణ్‌కుమార్‌ను చివరి చూపు చూస్తూ రోదిస్తున్న తండ్రి సారంగపాణి

న్యాయ కళాశాల ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తాం



సదస్సులో అభివాదం తెలుపుతున్న సంఘం నాయకులు

వెంకటాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో న్యాయ కళాశాల ఏర్పాటు చేయకపోతే ఉద్యమిస్తామని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ న్యాయ కళాశాల ఏర్పాటు న్యాయమైన డిమాండ్ అని, న్యాయ కళాశాల సాధించుకునేవరకు ప్రతి ఒక్కరూ ఉద్యమించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిమ తెగలను విస్మరిస్తున్నాయని, దేశంలో అత్యధికంగా అన్యాయానికి గురయ్యేది ఆదిమ తెగలేనని అన్నారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు ఎందుకు స్పందించడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అదేవిధంగా బాండ్ మొక్కజొన్న రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, వారి తరపున పోరాడుతామని అన్నారు. ఈ సదస్సులో నాయకులు పాయం సత్యనారాయణ, కొర్స నర్సింహమూర్తి, ఉయిక శంకర్, మైపతి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

అగ్గి అంటుకుంటే ఆహుతే..!

- పదేళ్లుగా డిమాండ్‌గానే తొర్రూరు ఫైర్‌స్టేషన్
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

తొర్రూరురూరల్(మహబూబాబాద్ జిల్లా), మార్చి 9(ఆంధ్రజ్యోతి): వేసవి కాలం అంటేనే అగ్ని ప్రమాదాలకు నెలవుగా ఉంటుంది. అలాంటిది ఎక్కడో ఒక్కచోట ప్రమాదవశాత్తు అగ్గి అంటుకుంటే అంతా ఆహుతి కావాల్సి వస్తోంది. అగ్ని ప్రమాదాలు జరిగితే ఫైరింజన్ సకాలంలో వస్తే ప్రమాదాలను నివారించవచ్చు. కానీ, తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఏ మారుమూల గ్రామంలో అగ్నిప్రమాదం జరిగినా ఫైరింజన్ కోసం గంటల కొద్ది ఆగాల్సిందే. అయినా వస్తుందనే నమ్మకం లేదు. తొర్రూరు మునిసిపాలిటీ, డివిజన్ కేంద్రంగా మారి పదేళ్లయినా ఇక్కడ పూర్తిస్థాయిలో కార్యాలయాలు కూడా లేకపోవడం విడ్డూరం. ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్న తొర్రూరు, పెద్దవంగర ప్రాంతాల్లో వేసవిలో నిప్పు అంటుకొని గడ్డివాములు, ఇళ్లు, వ్యవసాయ పొలాలు కాలిపోవడం లాంటివి జరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు పరామర్శించడానికి ప్రజాప్రతిధులువచ్చి వెళ్తుంటారు. అగ్ని ప్రమాదాలను నియంత్రించడానికి ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రజలు, రైతులు పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నా ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కనీసం ప్రజల గోడు వినే నాయకుడే లేడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంగా ఉన్న మహబూబాబాద్‌తో పాటు మరిపెడ మండలంలో మాత్రమే ఫైరింజన్లు ఉన్నాయి. ఎక్కడ అగ్నిప్రమాదం జరిగినా రెండు కేంద్రాల నుంచి మాత్రమే ఫైరింజన్లు రావాల్సి ఉంటుంది. వేసవికాలం కావడంతో ఎక్కువగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో అటు వైపు వెళ్తుంటాయి. తొర్రూరుకు వస్తుందనే నమ్మకం లేదు. ప్రతీ స్టేషన్‌కు 40 కిలోమీటర్ల దూరంలో తొర్రూరు ఉండడంతో వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నుంచి అదృష్టం ఉంటే గంట తరువాత వస్తదని, లేదంటే అంతా అగ్నికి ఆహుతి కావాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెల్లికట్టెలో జీపీ ట్యాంకర్‌తో మంటలు ఆర్పుతున్న సిబ్బంది (ఫైల్)

మండలంలో చోటుచేసుకున్న ప్రమాదాలు

తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారు పిల్లిగుండ్ల తండాలో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదం కారణంగా సుమారు 10 ఎకరాల్లో ఉన్న బోడు టేకు కలప, గృహ నిర్మాణం కోసం ఏర్పాటు చేసుకున్న దుంగలు దగ్ధం కావడంతో పాటు ఇళ్ల సమీపంలోకి మంటలు వ్యాపించాయి. సుమారు మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ప్రమాదం జరిగితే వర్ధన్నపేట నుంచి ఫైరింజన్ వచ్చి మంటలు చల్లార్చే వరకు 3 గంటలు పట్టింది. వెల్లికట్టె గ్రామంలో మన్నెం పద్మయ్య ఇల్లుకు షార్ట్‌సర్క్యూట్ కారణంగా నిప్పంటుకోగా ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులే ఇళ్లలోని నీళ్లతో చల్లార్చారు. పల్లె పాపయ్య అనే రైతుకు చెందిన 200 మోపుల గడ్డివాము అంటుకోవడంతో జీపీ ట్యాంకర్ సహాయంతో చల్లార్చే ప్రయత్నం చేశారు. అదేవిధంగా కొమ్మనపల్లి గ్రామంలో బానోత్ వెంకన్నకు చెందిన 250 మోపుల పశువుల దాణా, కంఠాయపాలెం గ్రామశివారు మీఠ్యా తండాకు చెందిన గుగులోతు శ్రీను ఇల్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికంగా ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా నియంత్రించలేక తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తొర్రూరు మండలం మడిపల్లి గ్రామ శివారులో జరిగిన అగ్నిప్రమాదం (ఫైల్)

పదేళ్లుగా పట్టించుకోవడం లేదు..

కొత్త వెంకట్‌రెడ్డి, రైతు సంఘం తొర్రూరు మండల కార్యదర్శి



తొర్రూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని పదేళ్లుగా డిమాండ్ చేస్తున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు మహబూబాబాద్, మరిపెడ, వర్ధన్నపేట ప్రాంతాల నుంచి ఫైరింజన్ రావాల్సి ఉంటుంది. దూర ప్రాంతాల నుంచి ఫైరింజన్ వచ్చే సరికే జరగాల్సిన నష్టం పూర్తిగా జరుగుతుంది. గొప్పల కోసం ప్రజాప్రతినిధులు హామీలిస్తున్నారు తప్పా చర్యలు తీసుకోవడం లేదు. తొర్రూరులో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే తొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ప్రమాదాలు జరిగితే వెంటనే నివారించే అవకాశం ఉంది.

మున్సిఫ్ కోర్టు ఏర్పాటు కోసం భవనాల పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న జడ్జిలు, డీఎస్పీ

కాటారం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ కేంద్రంలో మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటు కోసం ఆదివారం పలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను జిల్లా జడ్జి నారాయణబాబు, జూనియర్ సివిల్ జడ్జి రాంచందర్‌రావు, అదనపు కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి అఖిల పరిశీలించారు. భూపాలపల్లి, మంథని బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి వైటీసీ (యూత్ ట్రైనింగ్ సెంటర్), తహసీల్దార్ కార్యాలయం, పలు ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. వారి వెంట కాటారం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్‌కుమార్, హరిబాబు, ప్రధాన కార్యదర్శులు సహేందర్‌రెడ్డి, మహేందర్, ఏపీవో అనిత, ఎస్సై అభినవ్, పలువురు న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వలో కోళ్ల కళేబరాలు

- దుర్వాసనతో తండావాసుల ఇబ్బందులు



మాసుకుంటతండా సమీపంలో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వలో కొట్టుకువస్తున్న కోళ్ల కళేబరాలు

ఇనుగుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి మండలం రాముతండా గ్రామపంచాయతీ పరిధిలోని మాసుకుంటతండా సమీపంలో ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వలో ఆదివారం కోళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. మూడు రోజులుగా వందల సంఖ్యలో కాల్వలో చనిపోయిన కోళ్లు కొట్టుకువస్తూ నీటి ప్రవాహంలో దిగువ ప్రాంతానికి వెళుతున్నాయి. కాల్వకు ఇరువైపులా ముళ్లపొదలు ఉండడంతో వాటికి కొన్ని కోళ్ల కళేబరాలు చిక్కుకుపోయి అక్కడే ఉన్నాయి. పదుల సంఖ్యలో చనిపోయిన కోళ్లు కాల్వ వెంట ముళ్లలో చిక్కుకొని నిలిచి ఉండడంతో ఆ మార్గంలో తండాకు వెళుతున్న గిరిజనులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో మాసుకుంటతండా నుంచి రాముతండా వైపునకు ఈ నీళ్లు ప్రవహిస్తుండడంతో ఆయా తండాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు!

- ఓపెన్ కేటగిరి వారికి జారీ
- మళ్లీ వారికే ఓబీసీ సర్టిఫికెట్లు మంజూరు
- ఒక్కో దానికి రూ.50వేల వరకు వసూలు



మహదేవపూర్ రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు జారీ చేయడం భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపుతోంది. మహదేవపూర్, కాటారం, మహాముత్తారం, మల్హర్ మండలాల్లో ఓపెన్ క్యాటగిరీకి చెందిన ఓ వర్గానికి ఈ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో దానికి రూ.5వేల నుంచి రూ.10వేలు వసూలు చేసినట్టు సమాచారం. మళ్లీ ఆ వ్యక్తులకే ఆ బీసీ సర్టిఫికెట్ ఆధారంగా ఓబీసీ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిసింది. ఇందుకు ఒక్కో ఓబీసీ సర్టిఫికెట్‌కు అదనంగా మరో రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈతతంగంమంతా ఆయా మండల కేంద్రాల్లోని మీ-సేవ నిర్వాహకులతో పాటు జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్, భూపాలపల్లి తహసీల్దార్ సమీపంలోని మీ-సేవ కేంద్రాల ద్వారా నడుస్తున్నట్లు తెలుస్తోంది. సర్టిఫికెట్లు సైతం జిల్లా కేంద్రం నుంచి జారీ అయినట్లు సమాచారం. జేఈఈ మెయిన్స్ దరఖాస్తు సమయంలో ఈ అక్రమ సర్టిఫికెట్ల జారీ అయినట్లు తెలుస్తుండగా ఆలస్యంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మళ్లీ ఇదే తరహాలో వందల సంఖ్యలో సర్టిఫికెట్లు జారీ అయ్యాయని సమాచారం. అనర్హులకు బీసీ సర్టిఫికెట్లు ఇవ్వడమే కాకుండా ఓపెన్ క్యాటగిరీలోనూ అనర్హులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు తెలిసింది. అక్రమ మార్గంలో పొందిన ఈ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లతో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు, హెల్త్‌సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. అనర్హులకు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీ కోసం రూ.50వేల వరకు వసూలు చేసినట్లు వినికిడి. ఈ అక్రమ సర్టిఫికెట్ల వ్యవహారంలో ఓ సింగరేణి ఉద్యోగి ప్రమేయం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.

అనర్హులకు బీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీ చేస్తుండటంతో అసలైన అర్హులు ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తోందనే ఆవేదన సర్వత్రా వినిపిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నడుచుకునే ఉద్యోగులతో పాటు మీ-సేవ కేంద్రాలపైన సరైన పర్యవేక్షణ లేకనే ఇలాంటి తప్పిదాలు పునరావృతమవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

మామిడి తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్

- సత్ఫలితాలిస్తున్న విధానం
- కాయ నాణ్యత పెరిగి అధిక లాభాలు
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బ్యాగులకు 50 శాతం రాయితీ

భీమదేవరపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో ఫ్రూట్ బ్యాగింగ్ పద్ధతితో సత్ఫలితాలు సాధిస్తున్నారు. మామూలు పద్ధతిలో పండిన మామిడి కాయకు టన్నుకు రూ.25 వేల ధర పలుకుతుండగా ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి కాయలకు రూ.50-70వేల వరకు మార్కెట్లో ధర పలుకుతుంది. ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల కాయ ఎండ, వాన, క్రిమీ కీటకాల తాకిడిని తట్టుకోవడమే కాకుండా తేమను సైతం తట్టుకుంటుంది. దీంతో ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన కాయ నాణ్యతతో ఉండడంతో మార్కెట్లో ఇట్టే అమ్ముడుబోతుంది. ఫ్రూట్ బ్యాగింగ్ గోధుమ రంగు కవరు 50-55 జీఎస్ఎం లోనా బ్లాక్ పేపర్‌తో 30-35 జీఎస్ఎం ఉండాలి. బ్యాగు సైజు 18-30 సెంటిమీటర్ల వరకు వాటర్ ప్రూఫ్‌తో ఉం టుంది. ఇలా కాయను ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం వల్ల శ్వాసక్రియకు అనుకూలంగా ఉండాలి. మార్కెట్లో డిమాండ్ ఉన్న హిమాయత్, కేసర్, మల్లిక, బంగినపల్లి మామిడి కాయ లకు ఫ్రూట్ బ్యాగింగ్ చేస్తే రైతులు అధిక లాభాలు పొందవచ్చు.

పిందె ఏర్పడిన 45 రోజుల్లోగా బ్యాగింగ్ చేయాలి

మామిడి పిందె ఏర్పడిన 45 రోజుల తర్వాత నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు ఫ్రూట్ బ్యాగింగ్ చేయాలి. ఫ్రూట్ బ్యాగింగ్ చేసేటప్పుడు పండ్ల ఆరోగ్యాన్ని నిర్ధారించేందుకు పర్యవేక్షణ, నిర్వహణ క్రమం తప్పకుండా చేయాలి.

బ్యాగు కట్టే విధానం

బ్యాగును మామిడి కాయకు కట్టిన తర్వాత నెల తేదీ వేసుకోవాలి. మార్కెట్లో ప్రైవేట్ కంపెనీల వారు ఫ్రూట్ బ్యాగింగ్‌ను రూ. 1.25 చొప్పున అమ్ముతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలోని మామిడితోటలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆ రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై ఫ్రూట్ బ్యాగులను అందజేస్తున్నారు. ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన 45-60 రోజుల తర్వాత సహజ చక్కెర, ఫినోలిక్ కంపౌండ్స్ ఏర్పడతాయి. ఒక చెట్టుకు ఎన్ని ఫ్రూట్ బ్యాగింగ్‌లైనా చేసుకోవచ్చు.

బ్యాగింగ్‌తో లాభాలు

మామిడి తోటల్లో మామిడి కాయలకు బ్యాగింగ్ చేయడం వల్ల కాయ మొత్తం మూసివేయబడుతుంది. దీంతో ఈదురుగాలుల నుంచి తట్టుకుంటుంది. వాటర్ ప్రూఫ్ కావడంతో వర్షం, ఎండ, క్రిమికీటకాలు, పక్షుల భారీ నుంచి తప్పిస్తుంది. అలాగే కాయ సైజు, పరిమాణం నాణ్యతగా ఉంటుంది. పండు వేగంగా పెరిగేందుకు సహాయ పడుతుంది. మామూలుగా బ్యాగులను జాగ్రత్తగా వాడుకుంటే మరోసారి వాడుకోవచ్చు.



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి చెట్టు



మామిడి కాయకు కట్టిన ఫ్రూట్ బ్యాగ్



ఫ్రూట్ బ్యాగింగ్ చేసిన మామిడి పండ్లు

బ్యాగింగ్ చేయడం వల్ల అధిక లాభాలు



మామిడి తోటల్లో బ్యాగింగ్ చేయడం వల్ల అధిక లాభాలు సాధించవచ్చు. ఒక మామిడి కాయకు బ్యాగింగ్ చేస్తే ఎండ, వాన, క్రిమీ కీటకాల నుంచి సంరక్షించుకోవచ్చు. మామూలుగా బంగినపల్లి లాంటి మేలైన జాతి పండ్లకు టన్నుకు రూ.25వేల వరకు ధర పలుకుతుంది. బ్యాగింగ్ చేసిన మామిడి కాయకు టన్నుకు రూ. 50-70వేల వరకు మార్కెట్లో ధర పలుకుతుంది. మామిడి రైతులు మామిడి కాయకు బ్యాగింగ్ చేసుకుంటే మంచిది.

సుష్మిత, హార్టికల్చర్ ఆఫీసర్, హనుమకొండ

ఫ్రూట్ బ్యాగులకు రాయితీ ఇవ్వాలి



మామిడి ఫ్రూట్ బ్యాగులను రాయితీపై రైతులకు అందించాలి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు ఫ్రూట్ బ్యాగులను అక్కడి రైతులకు 50 శాతం రాయితీతో అందిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో కూడా ఫ్రూట్ బ్యాగులను 50శాతం రాయితీపై రైతులకు అందించాలి.

మండల సురేందర్, బీఆర్ఎస్, మండలాధ్యక్షుడు

ఈ-సాక్ష్యతో నేరస్థులకు పక్కా శిక్ష

- కొత్త చట్టాల రూపకల్పన తర్వాత అమలులోకి వచ్చిన ఈ-సాక్ష్య యాప్
- సంఘటన జరిగిన 48 గంటల్లోనే ఆన్‌లైన్‌లో కోర్టుకు సాక్ష్యాలు
- సాక్ష్యాలను భద్రపరిచేందుకు ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్లు

వరంగల్ క్రైం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నేరాలు జరిగినప్పుడు దానికి సంబంధించిన ఆధారాలకు సేకరించి కోర్టులో సమర్పించడం, నేరానికి పాల్పడినట్లు రుజువు చేయడం పోలీసుశాఖకు చాలా సవాల్‌గా మారేది. దానిలో ఉన్న కొన్ని లొసుగులను సాకుగా చేసుకొని నేరస్థులతో పాటు సాక్ష్యులు తమను బలవంతం పెట్టడం వల్ల ఒప్పుకున్నామని తప్పించుకునేది. అలాంటి వాటికి చెక్ పెడుతూ గతంలో బ్రిటిష్ వాళ్లు తీసుకొచ్చిన పాత చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చి కొత్త చట్టాలను రూపొందించడంతో ఈ-సాక్ష యాప్ తెరపైకి వచ్చింది. 2024 జూలై తర్వాత నుంచి ప్రతీ కేసులో సాక్షాధారాలకు సాక్ష యాప్‌నే వినియోగిస్తూ నేరం చేసిన వ్యక్తి శిక్ష నుంచి తప్పించుకోకుండా శిక్షల శాతంను పోలీసుశాఖ పెంచుతుంది.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌కు రెండు సెల్‌ఫోన్‌లు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ-సాక్ష్య యాప్‌లో ఆయా పోలీస్ స్టేషన్లలో జరిగే ప్రతీ నేరానికి సంబంధించిన సీన్ ఆఫ్ అఫెన్స్, సాక్ష్యాల వాంగ్మూలం, నేరస్థుడు తాను చేసిన నేరాన్ని ఒప్పుకోవడం వంటి అంశాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఈ యాప్‌లో రికార్డ్ చేసిన వివరాలన్నింటినీ పోలీసులు 48 గంటల్లో కోర్టుల్లోని ఐసీజేఎస్ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. కేసు బెంచీపైకి వచ్చిన రోజు ఐసీజేఎస్‌లో భద్రపరిచిన కేసుకు సంబంధించిన వివరాలను న్యాయమూర్తికి అందజేస్తారు. రికార్డు రూపంలో సాక్ష్యాలు ఉండటంతో నేరస్థులు, తాయిలాలకు తలొగ్గి లేదా నేరస్థులకు సాక్ష్యులు భయపడి తప్పించుకునే వీలు లేకుండా పకడ్బందీగా రూపకల్పన చేశారు. గతంలో ఎలక్ట్రానిక్ డివైస్ సాక్ష్యాలకు అవకాశం ఉన్నప్పటికీ సీడీ, పెన్ డ్రైవ్ రూపంలో కోర్టులో సమర్పించి ఇండియన్ ఎవిడెన్స్ యాక్టు ప్రాకారం 65-బీ అనే సర్టిఫికెట్ కోర్టుకు ఇవ్వాల్సి ఉండే దానికి చాలా సమయం అయ్యేది. కానీ సాక్ష యాప్‌తో ఆ తిప్పలన్నీ తప్పాయని పోలీసుశాఖ అంటుంది.

నేరస్థులకు శిక్ష పడటమే యాప్ ఉద్దేశం

ఇప్పటికే సాంకేతికతను వినియోగించిన సత్ఫలితాలను సాధిస్తున్న పోలీసుశాఖ ఈ సాక్ష యాప్‌తో నేరస్థులకు శిక్ష పడటంలో సక్సెస్ సాధిస్తోంది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ తన మొబైల్ నెంబర్‌తో ఒక సారి లాగిన్ అయి నేరానికి సంబంధించి వివరాలను అప్‌లోడ్ చేస్తే ఎప్పటికైనా ఆ సాక్ష్యాలు అందులో పదిలంగా ఉంటాయి. మళ్లీ సాక్ష్యాల వివరాలు కావాలనుకుంటే యాప్‌లో కేసు నెంబర్, తేదీ, సంవత్సరం నమోదు చేస్తే ఆ రోజు జరిగిన నేరానికి సంబంధించిన వివరాలన్నీ కనిపిస్తాయి. స్టేషన్ అధికారులతో పాటు కోర్టు డ్యూటీ నిర్వహించేవారితో పాటు స్టేషన్ రైటర్స్‌కు ఈ యాప్‌పై అవగాహన కల్పించారు. కేసు ఇన్వెస్టిగేషన్‌పై కోర్టులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ సాక్ష యాప్‌తో సులవుగా అవుతుందని పోలీసువర్గాలు తెలుపుతున్నాయి. కేంద్రం యాప్ తీసుకొచ్చిన తర్వాత మొట్టమొదటిగా తెలంగాణ పోలీసులే యాప్ ద్వారా సాక్ష్యాలను కోర్టుకు సమర్పించినట్లుగా కమిషనరేట్ పోలీసులు పేర్కొంటున్నారు.

రారండోయ్.. ఇస్రోను చూసొద్దాం..

- 9వ తరగతి విద్యార్థులకు ఆహ్వానం
- యువ విజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం
- ఏప్రిల్‌లో ఎంపిక, మేలో 14 రోజుల పాటు శిక్షణ
- అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన
- ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు
- దేశ వ్యాప్తంగా 7 కేంద్రాల్లో నిర్వహణ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్/జఫర్‌గఢ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) యేటా యువ విజ్ఞాన కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ ఏడాది చేపట్టబోయే కార్యక్రమం కోసం దేశ వ్యాప్తంగా తొమ్మిదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో వంద ప్రయోగాలు పూర్తి చేసుకుని ప్రపంచంలో అగ్రదేశాల సరసన భారత్ నిలిచిందనడంలో ఎలాంటి సందేహంలేదు. భారత్ పలు పరిశోధనలు చేపడుతూ శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు తెలియజేసేందుకు, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఇస్రో ఈ బృహోత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏటా అనేక మంది విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతోంది.

ఈ నెల 23 వరకు గడువు

సైన్స్ పట్ల ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఇస్రో అవకాశం కల్పించింది. విద్యార్థులు www.isro.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థి 2025, జనవరి 1 నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ ఉండాలి. విద్యార్థులు మొదట వారి ఈ-మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకున్న రెండు రోజుల తరువాత ఇస్రో ఏర్పాటు చేసే ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనాలి. ఈ ప్రక్రియ పూర్తయిన గంట తరువాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుతో పూర్తి వివరాలు నమోదు చేసి ధ్రువ పత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఏప్రిల్ నెలలో ఎంపిక జాబితాలను ప్రకటించనున్నారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఏప్రిల్ 7న దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేస్తారు. మే 19 నుంచి 30 వరకు యువికా-25 కార్యక్రమం నిర్వహిస్తారు. మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు (బాలసైంటిస్టులు) బహుమతులు అందజేస్తారు.

దరఖాస్తుదారులకు వెయిటేజీ కేటాయింపు

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు దారులు 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇస్తారు. 9వ తరగతి విద్యార్థులు సహ పాఠ్యాంశాలపై పట్టు కలిగి ఉండాలి. స్కౌట్స్ అండ్ గేమ్స్, ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటే 5 శాతం, గ్రామీణ ప్రాంత పాఠశాల విద్యార్థులకు మరో 15 శాతం అదనపు అర్హత కల్పిస్తారు. ఆన్‌లైన్ క్విజ్ ప్రతిభకు 10 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో పాల్గొన్న వారికి 10 శాతం, ఒలింపియాడ్ సైన్స్ పోటీల్లో బహుమతులు పొందిన ప్రతిభావంతులకు 5 శాతం, క్రీడా పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పిస్తారు.

శాస్త్ర, సాంకేతికంపై శిక్షణ

యువ విజ్ఞాన కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులకు శాస్త్ర, సాంకేతికం వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. మే నెలలో 14 రోజుల పాటు ఇస్రోకు సంబంధించిన దేశంలోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్- బెంగుళూరు, స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ -అహ్మదాబాద్, విక్రమ్ సారాబాయ్ స్పేస్ రీసెర్చ్ సెంటర్- తిరువనంతపురం, నార్త్ ఈస్ట్ అప్లికేషన్ సెంటర్ - షిల్లాంగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - డెహ్రాడూన్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ - హైద్రాబాద్, నీతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ - శ్రీహరికోట ఏడు కేంద్రాల్లో శిబిరాలను నిర్వహించి శిక్షణ ఇవ్వనున్నారు. రెసిడెన్షియల్ పద్ధతిలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రయోగాత్మక ప్రదర్శన, ల్యాబ్ సందర్శన, నిపుణులతో ప్రాక్టికల్స్, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు, ప్రముఖ శాస్త్రవేత్తల అనుభవాలు, చర్చ కార్యక్రమాలు వంటివి నిర్వహించడంతో పాటు అంతరిక్ష విజ్ఞానం, రాకెట్ ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులకు వివరిస్తూ అవగాహన కల్పిస్తారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ముగింపు కార్యక్రమంలో బహుమతులను అందిస్తారు. కాగా, ఎంపికైన విద్యార్థితో పాటు తల్లిదండ్రుల్లో ఒకరికి లేదా గైడ్ ఉపాధ్యాయుడికి ప్రయాణ ఖర్చులు చెల్లింపుతో పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను ఇస్రో కల్పిస్తుంది.

ఎంపికైన విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు

ఇస్రో నిర్వహించే యువికా కార్యక్రమానికి ఎంపికైన పాఠశాల విద్యార్థులకు ప్రయాణ, భోజన వసతి, సౌకర్యాలను ఇస్రో ఉచితంగానే కల్పిస్తోంది. ఎంపికైన విద్యార్థులను మే నెలలో 14 రోజుల పాటు ఇస్రోకు చెందిన స్పేస్ సెంటర్లకు తీసుకువెళ్తారు. అక్కడ సైన్స్‌కు సంబంధించిన వింతలు, విశేషాలు, నవగ్రహ కూటమి మొదలగు అంశాలపై వారికి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం విద్యార్థులకు కల్పిస్తారు.

ఎవరు అర్హులంటే..

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. 8వ తరగతిలో సాధించిన మార్కులకు 50 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. స్పేస్, సైన్స్ క్లబ్‌లలో ఉంటే 5 శాతం, జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపితే 10 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్స్‌అండ్ గైడ్స్ విభాగాల్లో ఉంటే 5 శాతం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారికి 20 శాతం ప్రాధాన్యం ఇస్తారు.

ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించాలి

డాక్టర్ ఎ. రవీందర్‌రెడ్డి, డీఈవో, మహబూబాబాద్



అంతరిక్ష పరిశోధనలో అగ్రగామిగా నిలుస్తున్న ఇస్రో విద్యార్థులకు కల్పిస్తున్న యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)లో జిల్లా నుంచి ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఇస్రో కల్పిస్తున్న అద్భుత అవకాశాన్ని అత్యధికంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా వారికి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

ఎం.రమేశ్, డీఈవో, జనగామ



ఆసక్తి గల 9వ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో శాస్త్రీయ సాంకేతిక అవగాహన, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఈ శిక్షణ అవగాహన పెంచుతుంది. తద్వారా విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు దోహదపడుతుంది. విద్యార్థులు తమ ప్రతిభను చూపేందుకు ఈ కార్యక్రమం చక్కటి వేదిక. జిల్లాలోని తొమ్మిదో తరగతి విద్యార్థులు ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి, లేదా ఇస్రో యువికా వెబ్‌సైట్‌లో సంప్రదించాలి.

యువికాతో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి

బి. అప్పారావు, డీఎస్వో, మహబూబాబాద్



యువ విజ్ఞాన కార్యక్రమంతో విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెరుగుతుంది. అనేక రంగాల్లో సేవలందిస్తూ కృత్రిమ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపిస్తూ, ప్రపంచంలో అగ్రస్థానాన్ని పొందిన ఇస్రో సంస్థ పాఠశాల విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలు, పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడుతోంది. ఇందులో ఎక్కువ మంది విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు సైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలి.

హర.. ముక్తీశ్వర..

- కల్పతరువు కాళేశ్వరం.. దినదినాభివృద్ధి
- ఆలయ అభివృద్ధితో ఎంతో మందికి జీవనోపాధి
- దండకారణ్యం నుంచి పట్టణ స్థాయి ప్రగతి

మహదేవపూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు దండకారణ్యం.. కాకులు దూరని కారడవిలా ఉండేవి కాళేశ్వరం పరిసరాలు. ఇళ్లు అక్కడక్కడ కొన్ని మాత్రమే ఉండేవి. త్రివేణి సంగమ ఒడ్డున స్వల్పంగానే జన జీవనం సాగేది. ఆర్టీసీ బస్సులు కూడా రాని పరిస్థితి. రవాణా లేక, ఇతరత్రా సౌకర్యాలు లేక అష్టకష్టాలు ఎదుర్కొనే వారు అక్కడి వాసులు. దీంతో చాలా మంది వలస వెళ్లిపోయారు. ఇక్కడి భూములు వదులుకొని కాటారం, భూపాలపల్లి, వరంగల్, హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయానికి భక్తులు ఎడ్ల బండ్లలో వచ్చే వారు. 1976లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి, దేవాదాయ శాఖ ఇన్‌చార్జి మంత్రిగా ఉన్న చొక్కారావు చొరవతో ఆదిశంకరాచార్యుల సూచన మేరకు కాళేశ్వరాలయాన్ని అభివృద్ధి చేశారు. ఆయా పనులు చేపట్టి ఆలయానికి 1982లో జీర్ణోద్ధారణ చేశారు. ఆ తర్వాత ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. కాళేశ్వరంతో పాటు మహదేవపూర్ కూడా ప్రగతి వైపు పరుగులు పెడుతోంది. ఈ ఆలయం ద్వారా ఎంతో మంది జీవనోపాధి పొందుతున్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం

మూడు రాష్ట్రాల వారధిగా కాళేశ్వరం రవాణా వ్యవస్థ మెరుగుపడింది. ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మహారాష్ట్రలను కలుపుతూ బ్రిడ్జీలు, రోడ్లు ఏర్పడటంతో ఇతర రాష్ట్రాల ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్నారు. త్రివేణి సంగమం వద్ద కాళేశ్వరుడికి నిత్యం వేలాది మంది పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో పుణ్య స్నానం ఆచరించి భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహిస్తుంటారు. ప్రయాగ్‌రాజ్ తర్వాత త్రివేణి సంగమంలో కొలువైన క్షేత్రంగా కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయం ఖ్యాతి పొందింది. దీని దగ్గర ఉన్న నదిని అమ్మవారిగా పూజలు నిర్వహిస్తుంటారు. సాయంకాల ప్రదోషకాల వేళ నదీ హారతి ఇస్తారు. గోదావరి నది స్నాన మాచరిస్తే శరీర శుద్ధితో పాటు పాపాలు పోతాయని పురాణాలు చెబుతున్నాయి.



కాళేశ్వరాలయం వద్ద వెలిసిన భవనాలు

ప్రభుత్వానికి ఆదాయం

ఆలయానికి వచ్చే భక్తులతో రాష్ట్ర ప్రభుత్వానికి సైతం పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. కాళేశ్వరానికి రోజువారీగా ఆర్టీసీ బస్సులకు చాలామంది భక్తులు తరలివెళ్తుంటారు. దీంతో కాళేశ్వరానికి భూపాలపల్లి, హనుమకొండ, పరకాల, మంథని, కరీంనగర్ ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వస్తుండటంతో ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం సమకూరుతోంది. ఆలయ హుండీలు, టెండర్లు, భక్తులు చేసే ప్రత్యేక పూజల ద్వారా వచ్చే డబ్బులు, టోకెన్లు, లడ్డూలు వసతి గృహాలతో పాటు ఇతర అవసరాలకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. అలాగే ఇక్కడ హరిత హోటల్ ద్వారా మెరుగైన ఆదాయ వస్తోంది.

అర్చకులకు ఉపాధి

చనిపోయిన వారి అస్తికలు కలిపేందుకు కాళేశ్వరానికి జనం పెద్ద ఎత్తున తరలివస్తారు. త్రివేణి సంగమ గోదావరిలో కలిపితే వారి ఆత్మకు శాంతితో పాటు ముక్తి లభిస్తుందనే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. పూజా క్రతువులు నిర్వహించడానికి అర్చకులు అక్కడ ఉంటారు. వందలమంది అర్చక కుటుంబాలు సైతం ఉపాధి పొందుతున్నాయి.

బోటింగ్, ఆటోల ద్వారా..

త్రివేణి సంగమ గోదావరిలో బోటింగ్ సిస్టం ఉంది. వేల కొద్ది మంది భక్తులు త్రివేణి సంగమంలో బోటింగ్‌తో పాటు ప్రాణహిత అవతల వైపు వెళ్తుంటారు. బోటింగ్ సిస్టం ద్వారా వందల కొద్ది ఉపాధి పొందుతున్నారు. అలాగే కాళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ నుంచి గోదావరి వరకు నిత్యం ఆటోలు భక్తులను తరలిస్తుంటాయి. దీంతో వందల మంది ఆటో కార్మికులు పెద్ద ఎత్తున జీవనం సాగిస్తున్నారు.

హోటళ్లు, లాడ్జీల ద్వారా..

కాళేశ్వరంలో భక్తులు బస చేయడానికి హరిత హోటల్ ఉంది. దీంతోపాటు ప్రైవేటు హోటళ్లు, లాడ్జీలు ఉన్నాయి. అలాగే భోజన, టిఫిన్‌సెంటర్లు, కిరాణ దుకాణాలు ఇలా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు.

పెరుగుతున్న రియల్ ఎస్టేట్

కాళేశ్వరం పరిసర ప్రాంతాల్లో ఒకప్పుడు సాగు భూములున్నా ఎవరూ ఉండేవారు కాదు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు రియల్ ఎస్టేట్ రంగంలో చాలామంది జీవనోపాధి పొందుతున్నారు. కాళేశ్వరం సమీపాన ఒక ఎకరం భూమి ధర రూ.కోటి పైమాటే. పంటలు సాగు చేసే భూములు రూ.10 లక్షల నుంచి రూ.30లక్షల వరకు అందుబాటులో ఉన్నాయి. ఇక ఇళ్ల స్థలాల మాట రేట్లు ఎక్కువగానే ఉన్నాయి.

మోదుగు పూసినదీ..

మోదుగు పూలు కనువిందు చేస్తున్నాయి. హోలీ వేడుకలకు సిద్ధం అన్నట్టు కళకళలాడుతున్నాయి. మోదుగుపూలు విరబూసి పండుగ వస్తున్న విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. ఆకురాలే కాలంలో అడవుల్లోని మోదుగు చెట్లకు పూసిన లేలేత ఎరుపురంగులోని పూలు అడవుల్లో అందంగా కనిపిస్తున్నాయి. గతంలో ప్రజలు మోదుగు పువ్వును హోలీ పండుగకు ఐదు రోజుల ముందు సేకరించి మట్టి పాత్రల్లో ఉడికించి రంగు తయారు చేసేవారు. ఈ రంగు శరీరంపై పోస్తే వారం రోజులు ఉండేది. అలాగే దుస్తులకు అంటిన మోదుగు పువ్వు మరకలు పోవు. మోదుగు పువ్వుతో ఎలాంటి చర్మ వ్యాధులు వచ్చేవి కావు. కానీ, నేటి అధునిక ప్రపంచంలో మార్కెట్లో లభించే రకరకాల రసాయన రంగులకు ప్రజలు ఆకర్షితులై చర్మవ్యాధులను కొని తెచ్చుకుంటున్నారు. దీంతో మోదుగు పూలు చెట్లకే పరిమితమవుతున్నాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రం, నెక్కొండలో ఇవి విపరీతంగా విరబూయగా వాటిని పక్షులు ముద్దాడాయి. ఈ సుందర దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి/నెక్కొండ

నెక్కొండలో విరబూసిన మోదుగు పూలు





భూపాలపల్లిలో మోదుగు పువ్వులపై వాలిన పక్షులు



'మహిళలు హక్కుల రక్షణ కోసం పోరాడాలి'



మహిళలను సన్మానిస్తున్న గిరిజన సామాజిక చైతన్యవేదిక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్

మహబూబాబాద్‌టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మహిళల హక్కుల రక్షణ కోసం ఉద్యమించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రథం ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్ నాయక్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక చట్టాలు, పథకాలున్నప్పటికీ అవి అమలుకు నోచుకోవడంలేదని చెప్పారు. మహిళలపై అత్యాచారాలు, అసమానతలు, దౌర్జన్యాలు, వివక్షత ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోపిడీ, వివక్షత, అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళలకు క్రీడా, నృత్య, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించారు. ప్రథమ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సమన్వయకర్త భూక్య స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుండు సులోచన, బానోత్ పున్నమి, ప్రత్యూష, భూక్య జ్యోతి, భారతి, సావిత్రి, లకావత్ విజయపాల్గొన్నారు.

పీఆర్టీయూ-టీఎస్ ఆధ్వర్యంలో..

మహబూబాబాద్ పట్టణంలో పీఆర్టీయూ-టీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ మాట్లాడుతూ మహిళా సాధికారిత సాధించాలంటే మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని చెప్పారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భూక్య రామోజీనాయక్, కాపరబోయిన సుజాత, కోట్యా, గీత, ఉమా, శ్యామలదేవి, కౌసల్య, సుశీల పాల్గొన్నారు.

280 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం డీసీఎం

పెద్దవంగర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి.. డీసీఎం, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఆదివారం ఠాణాలో ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. నల్గొండ జిల్లా గుండ్లపల్లి మండలం రుద్రాయగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ మేకల నాగయ్య, హైదరాబాద్ కొత్తపేటకు చెందిన ఐతే క్రిష్ణ ఖమ్మం జిల్లాలో రేషన్‌బియ్యం కొనుగోలు చేశారు. డీసీఎం వాహనంలో రూ.4,68,000 విలువ చేసే 240 బస్తాలలో 120 క్వింటాల బియ్యాన్ని హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో పెద్దవంగర మండలంలోని కొరిపెల్లి శివారు వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా, పక్క సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని, ఇరువురిపై కేసు నమోదు చేసి, డీసీఎం సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే మండలంలోని ఎల్‌బీతండాలో సిద్దిపేట జిల్లా జైదపూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు రాజు, మండలంలోని బావోజీతండాకు చెందిన దరావత్ కోబ్ల అనే ఇద్దరు వ్యక్తులు తండాలో రేషన్ బియ్యంను కొనుగోలు చేసి ఆటోలో హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో వారి వద్ద నుంచి రూ.32వేలు విలువ చేసి 40 బస్తాలలో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి పట్టుబడిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అక్రమాల వ్యాపారాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అన్నారు. ఎవరైనా అనుమానితులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీస్‌లో సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వెంకటయ్య, విజయ్‌కుమార్, సంతోష్, విజయ్‌భాస్కర్, ప్రశాంత్, కళ్యాణ్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పోలీస్ టీంకు కోచ్‌గా మురళి

● వాలీబాల్ శిక్షకుడిగా వరుసగా మూడోసారి



ఇనుగుర్తి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఓరుగంటి మురళి తెలంగాణ పోలీస్ వాలీబాల్ టీంకు కోచ్‌గా ఎంపికయ్యారు. ఈనెల 10 నుంచి 12 వరకు హర్యానా రాష్ట్రం మధుబన్‌లో నిర్వహించే ఆల్ ఇండియా పోలీస్ వాలీబాల్ క్లస్టర్ టోర్నమెంట్‌లో పాల్గొనే రాష్ట్ర బృందానికి శిక్షకునిగా వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆయన రాష్ట్ర టీంకు గత మూడేళ్లుగా వివిధ రాష్ట్రాల్లోని పోటీలకు కోచ్‌గా వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తన అభివృద్ధికి సహకరించిన ఐజీ రమేష్‌రెడ్డి, ఎస్‌వో రామారావు, స్థానిక కోచ్ సట్ల భిక్షం, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు కన్న సాంబయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

బావిలో పడి ఒకరు మృతి

డోర్నకల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని సోమ్లతండా మధ్యలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కాలనీకి చెందిన దీకొండ సత్యం(69) టైలర్‌గా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈనెల 7న ఇంటి నుంచి వెళ్లిన సత్యం తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు బంధువుల ఇండ్లలో వాకబు చేశారు. ఎక్కడా అచూకీ లభించ లేదు. కాగా, ఆదివారం సోమ్లతండా సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో సత్యం మృతదేహం కనిపించడంతో తండావాసులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. అమృతదేహం సత్యంగా భావించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వచ్చి ఈ మృతదేహం సత్యంగా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె శ్రీలత ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు.

పలు షాపుల్లో చోరీలు

కురవి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కురవిలో శనివారం అర్ధరాత్రి పలు షాపుల్లో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. అయ్యంగారి బేకరీలో షట్టర్‌ను రాడ్లతో తొలగించి అందులోని సుమారు రూ.40 వేల నగదును ఎత్తుకువెళ్లారు. అదే విధంగా మధు బెంగళూరు బేకరీలో సైతం షట్టర్‌ను తొలగించి చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత మోక్షసాయి కిరాణంలో ఫ్రిజ్ తాళం పగులగొట్టి బీర్లను ఎత్తుకువెళ్లారు. ఆ తర్వాత బస్టాండ్‌లోని పాన్‌షాపులో తలుపులు పగులగొట్టి సిగరేట్లు, పాన్‌మసాలాలు ఎత్తుకువెళ్లారు. ఈ విషయమై బాధితులు కురవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్న ఎస్సై తెలిపారు.

ఉప్పరగూడెంలో..

సీరోలు, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్నం ఓ ఇంట్లో చోరీ జరిగి రూ.లక్ష అపహరించుకుపోయిన ఘటన ఉప్పరగూడెంలో చోటు చేసుకుంది. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం. తల్లాడ ఉమేష్ తన ఇంటికి తాళం వేసి ఆదివారం ఉదయం తన కుమారుడి వెంట్రుకలు తీసేందుకు కురవి మండల కేంద్రంలోని శ్రీవీరభద్రస్వామి దేవస్థానానికి వెళ్లాడు. కుమారుడి వెంట్రుకలు తీయించుకొని మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఇంటికి వచ్చే చూసే సరికి తాళం పగలగొట్టి ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇంట్లో ఉన్న రూ.లక్ష నగదును అపహరించుకుపోయారని తెలిపారు. ఉమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

గీత కార్మికుడి మృతి

నెల్లికుదురు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన గీతకార్మికుడు రావుల రవీదర్‌గౌడ్ (57) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. ఫిబ్రవరి 28న రవీందర్‌గౌడ్ తాగిచెట్టు పైనుంచి జారిపడటంతో తీవ్రగాయాలైనాయి. వెంటనే హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య స్వరూప, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు రావుల సంపత్‌గౌడ్ ఫిర్యాదు చేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టంకు తరలించిట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కోన్నాడు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మరిపెడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి పర్మిషన్లు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం పట్టుకొని ఆ ట్రాక్టర్ల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్‌గౌడ్ తెలిపారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లి శివారు మంచ్యాతండాకు చెందిన గుగులోత్ నరేశ్, సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం మామిళ్లమడువ పీర్యాతండాకు చెందిన భూక్యా భద్రులపై కేసు నమోదు చేసి ఆ ట్రాక్టర్లను స్వాధీనం పర్చుకున్నట్లు తెలిపారు.

నల్లబెల్లం స్వాధీనం

మరిపెడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు హానికరమైన నల్ల బెల్లం, పటికను పట్టుకొని అందుకు కారకుడైన ఓ వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు మరిపెడ ఎస్సై బోలగాని సతీశ్‌గౌడ్ తెలిపారు. మండలంలోని రేఖ్యాతండాకు చెందిన బానోత్ రాగూర్ కిరాణం షాపులో క్వింటా నల్లబెల్లం, 10 కిలోల పటిక నిల్వ చేసి ఉంచడంతో అందిన సమాచారం మేరకు పోలీసులు రైడ్ చేసి వాటిని పట్టుకున్నారని ఎస్సై తెలిపారు.

టీవీలకు అతుక్కుపోయిన క్రికెట్ అభిమానులు

● ఆదివారం సెలవు కావడంతో మ్యాచ్‌ను వీక్షించిన అన్ని వర్గాలు



కేసముద్రంలో హెయిర్ సెలూన్ షాపులో టీవీలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న క్రీడాభిమానులు

మహబూబాబాద్ టౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : దుబాయి వేదికగా జరిగిన ఇంటర్నేషనల్ చాంపియన్స్ ట్రోఫీ (ఐసీసీ)-2025 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రికెట్ క్రీడాభిమానులు అంతా టీవీలకు అతుక్కుపోయారు. ఫైనల్ మ్యాచ్ మాధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభం అయ్యేంతా వరకు ఎప్పుడేప్పుడు సమయం గడుస్తుందా అని క్రికెట్ అభిమానులు ఉత్కంఠతతో ఎదురు చూశారు. ప్రతిష్టాత్మక చాంపియన్ క్రికెట్ ట్రోఫీ ప్రారంభం నుంచి ఇండియా జట్టు ఎక్కడా ఓటమి చెందకుండా అన్ని మ్యాచ్‌లు గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు అంతా సిద్దమవ్వడంతో మానుకోట జిల్లా వ్యాప్తంగా క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. ఆదివారం దుబాయిలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్, న్యూజిలాండ్ జట్టుతో తలపడగా మ్యాచ్‌ను వీక్షించేందుకు ప్రజలంతా టీవీలకు అతుక్కు పోయారు. ఉదయం వేళల్లో పనులు ముగించుకుని మధ్యాహ్నం వేళకు అంతా టీవీల వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో ఎవరు కూడ బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి టీవీల్లో క్రికెట్ మ్యాచ్ వీక్షించడంతో రోడ్లన్ని నిర్మానుషంగా మారిపోయాయి. ఆదివారం విద్యాసంస్థలు, కార్యాలయాలకు సెలవుదినం కావడంతో అటువిద్యార్థులు, యువత, ఉద్యోగులు ఇంటిల్లిపాది కలిసి క్రికెట్‌ను వీక్షించడం కన్పించింది. కొన్ని ప్రాంతాల్లో స్నేహితులు కొంత మంది కలిసి ఒకే చోట క్రికెట్‌ను వీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడి చూసిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్ గూర్చి ఆసక్తి కర చర్చ జరిగింది. చిన్నారుల నుంచి మొదలుకుని పెద్దల వరకు వయసుతో నిమిత్తం లేకుండా టీవీల ఎకదుట కూర్చుని క్రికెట్ ఫైనల్ మ్యాచ్ ముగిసేంత వరకు ఆసక్తిగా వీక్షించారు. అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాల్సి వచ్చిన వారు సైతం తమ సెల్‌ఫోన్‌లో ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించడం గమనార్హం. మొత్తంగా భారత్ విజయం సాధించడంతో క్రికెట్ అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు.

'వైద్యులపై చర్యలు తీసుకోవాలి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు

నెహ్రూసెంటర్, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధుల పట్ల సమయపాలనపాటించని వైద్యులు, అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రతిరోజు రోగులతో కిటకిటలాడే జిల్లా ఆస్పత్రి బీరు సీసాలతో కళకళలాడుతుందని ఆరోపించారు. జిల్లా ఆస్పత్రిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి అసాంఘీక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణమే సంబంధిత ఆస్పత్రి సూపరిండెంట్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దారావత్ హత్తిరాంనాయక్ ఉన్నారు.

30న చలో మానుకోట..

గిరిజనుల సమస్యల సాధన కోసం 30న ఛలో మానుకోట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. కేలోత్ మల్సూర్‌నాయక్, దారావత్ బిక్షంనాయక్, భగవత్, నరేష్, దారావత్ హత్తిరాం, భూక్య శ్రీను, గుగులోతు చక్రు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చుని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. మహబూబాబాద్‌లోని తెలంగాణ గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాగంటి ప్రభాకర్ నేతృత్వంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పూలే, అంబేద్కర్ ఆలోచన విధానాలను అనుసరిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తూనే సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తుందన్నారు. గత మూడేళ్లుగా జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, గురుకుల, ఆశ్రమ, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, జూనియర్ కళాశాలల్లో సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తూ మందులను అందిస్తున్నామని తెలిపారు. అంబేద్కర్ భావజాలంతో నడుచుకునే వైద్య బృందంచే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుపై దృష్టి సారించగలుగుతారని, ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నేతావత్ వెంకన్న, సురేందర్‌నాయక్, రజితానాయక్, సురేందర్, సంఘం బాధ్యులు భద్రునాయక్, మహేందర్, యాకూబ్‌నాయక్, ఇన్చార్జీ ప్రిన్సిపాల్ మాధవిలత, అధ్యాపకులు ప్రఫుల్ల, సోమేశ్వరి, కళాశాల మెడికల్ సిబ్బంది అనూష, నీల పాల్గొన్నారు.

నేటి నుంచి నాటిక పోటీలు

తొర్రూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు పట్టణంలో 13వ జాతీయ స్థాయి తెలుగు ఆహ్వానిత నాటిక పోటీలను నిర్వహించనున్నట్లు చైతన్య కళాసమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు మన్నూరు ఉప్పల నారాయణ, పినాక పాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12ఏళ్లుగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు 13వ జాతీయ స్థాయి నాటకాలు, సాంస్కృతిక శాఖ, చలనచిత్ర, టీవీ, రంగస్థల కళలు తదితర కళలు అంతరించి పోతున్న నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల నుంచి కళాకారులు, కళా సంస్థలు ఇతివృత్తమైన నాటక ప్రదర్శనలు చేసేందుకు వస్తున్నారన్నారు. డివిజన్ పరిధిలోని వ్యాపార, వాణిజ్య, వివిధ రంగాల నాయకుల సౌజన్యంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాములోరి గుడిలో సుదర్శన హోమం

మరిపెడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మరిపెడబంగ్లాలోని రాములోరి గుడిలో శ్రీరాముడి జన్మ నక్షత్రం పురస్కరించుకొని ఆ ఆలయ అర్చకులు ఆదివారం భక్తుల కోసం సుదర్శన హోమం నిర్వహించారు. అనంతరం పేదలకు అన్న వితరణ కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

తొర్రూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తొర్రూరు మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దాసరి మల్లయ్య కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మల్లయ్య చిత్ర పటానికి నివాళి అర్పించారు. తొర్రూరు పట్టణ ప్రజలకు దాసరి మల్లయ్య చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ మంగళపల్లి ఆశయ తల్లి లక్ష్మి అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించి ఆర్థికసాయం అందించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు మంగళపల్లి శ్రీనివాస్, బిందు శ్రీను, కుర్ర శ్రీను, శ్రీనివాస రావు, ప్రదీప్ రెడ్డి, వెంకన్న, భాస్కర్, చిట్టిమల్ల మహేష్, పంజ కల్పన, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

'షాదీఖాన అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం మతపెద్ద ఇక్బాల్

మహబూబాబాద్ టౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోడ్ ఉర్దూ ఘర్‌షాదీఖాన అభివృద్ధి కోసం కలిసికట్టుగా కృషి చేద్దామని ముస్లిం మతపెద్దలు మహ్మద్‌ఇక్బాల్, షేక్ ఆసిఫ్ అలీ, మహ్మద్ ఫజల్ అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని కంకరబోడ్ ఉర్దూ ఘర్‌షాదీఖానలో ఆదివారం మస్లిం మతపెద్దలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2001లో నిర్మించినషాదీఖానలో ఎటువంటి మౌళిక వసతులు కల్పించకపోవడంతో అది అభివృద్ధికి నోచుకోక నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరకుందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో సుమారు 16 వేల మంది ముస్లిం జనాభాఉందని, జిల్లా ఏర్పాటుతోనైనా షాదీఖాన అభివృద్ధి చెందుతుందని ఆశ పడ్డప్పటికి అమలుకు నోచుకోలేదన్నారు. అనంతరం ముస్లింపెద్దలు, యువకులు కలిసి కంకరబోడ్ షాదీఖాన డెవలప్‌మెంట్ కమిటీని ఎన్నుకున్నారు. మహ్మద్ అఫ్జల్, యాకూబ్‌పాషా, జాకీర్, ఇస్మాయిల్, ఇమామ్, హుస్సేన్, ఫయాజ్, నయీం, పాష, అమీర్‌ఖాన్, ఫయాజుద్దీన్ పాల్గొన్నారు.



పెనుగొండలో రక్తదానం చేస్తున్న యువకులు

పెనుగొండలో రెడ్‌క్రాస్ రక్తదాన శిబిరం

కేసముద్రం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెనుగొండలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మాధవపెద్ది ఉపెందర్‌రెడ్డి, గ్రామ యువజన సంఘం సహకారంతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి రక్తనిధి కేంద్రం నిర్వహణలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 53 మంది రక్తదానం చేయగా వారికి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా కోశాధికారి మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, సభ్యులు గొర్రె వెంకన్న, డాక్టర్ హితేష్‌కుమార్, వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య చికిత్స కోసం రూ.30వేల సాయం

కేసముద్రం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధన్నసరిలో అనారోగ్యంతో బాధపడుతున్న కొండ నాగయ్యకు హైలెట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.30వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన నాగయ్యకు మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం, దాతలు ముందుకు రావాలని ఆ అసోసియేషన్ బాధ్యులు కోరారు.

మోడల్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

● ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

కొత్తగూడ, మార్చి9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐటీడీఏ మోడల్ క్రీడా పాఠశాలలో, బోయినపల్లిలోని వాటర్ క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. 2025, 2026 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు కొత్తగూడలోని మోడల్ క్రీడా పాఠశాలలో 5వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 5సీట్లు, 8వ తరగతిలో 6సీట్లు, 9వ తరగతిలో 6సీట్లు, 10వ తరగతిలో 10సీట్లు ఉన్నాయన్నారు. బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ స్కూల్‌లో 5వ తరగతిలో 10సీట్లు బాలికలకు, 10సీట్లు బాలుర విద్యార్థులకు ఉన్నాయన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి 15 వరకు ములుగు, భూపాలపల్లి జిల్లాల విద్యార్థులు పీఎంఆర్‌సీ ఏటూరునాగారంలో, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల విద్యార్థులు పీఎంఆర్‌సీ హన్మకొండలో, మహబూబాబాద్ జిల్లా విద్యార్థులు పీఎంఆర్‌సీ మహబూబాబాద్‌లో ధరకాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 17వ తేదీ నుంచి 20 వరకు ఆయా జిల్లాలో విద్యార్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 26వ తేదీ నుంచి 28వరకు కొత్తగూడలో ఐటీడీఏ నియమించిన కమిటీ ఆధ్వర్యంలో తుది ఎంపిక నిర్వహిస్తున్న పేర్కొన్నారు.

గార్ల మండల కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

గార్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో టీడీపీ సీనియర్ నాయకుడు పతండి రమేష్ (66) శనివారం రాత్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందాడు. రాంపురం గ్రామానికి చెందిన రమేష్ బట్టల వ్యాపారం చేస్తూ, గార్లలో స్థరపడ్డాడు. టీడీపీ పార్టీ అభివృద్ధి విశేషంగా కృషి చేయడం జరిగింది. రమేష్ మరణ వార్త తెలియగానే టీడీపీ రాష్ట్ర నాయకుడు కొండపల్లి రాంచందర్‌రావు, మాజీ సర్పంచ్ అజ్మీరా బన్సీలాల్, సీపీఐ రాష్ట్ర నాయకుడు కట్టెబోయిన శ్రీనివాస్, సీపీఎం నాయకులు కందునూరి శ్రీనివాస్, అలవాల సత్యవతి, ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి, నివాళులర్పించారు.

హైర్‌బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

● డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు నాగన్న

మహబూబాబాద్ టౌన్, మార్చి 09 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని హైర్‌బస్ డ్రైవర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కుమ్మరికుంట్ల నాగన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో హైర్ బస్ డ్రైవర్స్ యూనియన్ సమావేశాన్ని ఆదివారం వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ రాష్ట్రంలో హైర్‌బస్సు డ్రైవర్లు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనంతో పని చేస్తున్నారని చెప్పారు. పీఎఫ్, బీమా సౌకర్యం కూడాలేని పరిస్థితుల్లో డ్రైవర్లు పని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనం పెంచడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుమ్మరి కుంట్ల నాగన్న, అధ్యక్షుడిగా పాక చంద్రశేఖర్, కార్యదర్శిగా శ్రావణ్, ఉపాధ్యక్షుడిగా దొంతు రవీందర్, కోశాధికారిగా కొమరవెళ్లి, సహాయకార్యదర్శిగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.